క్లుప్తంగా

బీసీ హాస్టల్ వార్డెన్‌గా నవీన్ కుమార్



రొంపిచెర్ల: స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్‌గా నవీన్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి వార్డెన్ సురేష్ కుమార్ రెడ్డిని కల్లూరు బీసీ హాస్టల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కల్లూరు బీసీ హాస్టల్ వార్డెన్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ, బీసీ హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ఎవరైనా బీసీ హాస్టల్‌లో చేరవచ్చన్నారు.

హోమియో వైద్యాధికారిణిగా గౌరి



చౌడేపల్లె: హోమియోపతి వైద్యాధికారిణిగా గౌరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పుంగనూరు నుంచి బదిలీపై చౌడేపల్లెకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి బదిలీపై వెళ్లడంతో కొన్నేళ్లుగా హోమియో వైద్య కేంద్రం మూతపడింది. ఎట్టకేలకు వైద్యాధికారి రావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో హోమియో వైద్యసేవలకు మళ్లీ అవకాశం కలిగింది. తమ సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఏఓగా మోహన్‌కుమార్



చౌడేపల్లె: మండల వ్యవసాయాధికారిగా జి.మోహన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా రామసముద్రం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ఏఓ జ్యోతమ్మ పుంగనూరు ఏడీఏ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నూతన ఏఓ మాట్లాడుతూ, రైతులకు కొత్తపంటల సాగుపై అవగాహన కల్పించడంతోపాటు ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతు సేవా కేంద్రాల సేవలు రైతులకు అందేలా చూస్తామని చెప్పారు.

ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయకేతనం





హుజైఫా సుల్తానా, హిమబిందు





హరిక్రిష్ణ, మేనక

గంగవరం: ఎస్వీయూ విడుదల చేసిన 3వ సెమిస్టర్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు(జీపీఏ) సాధించినట్టు ఎంవీఆర్ డిగ్రీ కాలేజీ కరెస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి సోమవారం తెలిపారు. బీకాంలో హుజైఫా సుల్తానా(9.30), నజీరా(9.17), ఫాతిమా(9.13), బీసీఏలో హిమబిందు(9.10), లయ(8.95), అర్షియా సుల్తానా(8.82), బీబీఏలో హరిక్రిష్ణ(8.68), హారతి(8.11), కావ్యశ్రీ(8.07), బీఎస్సీలో మేనక(8.50), శైలజ(8.23), మేనక(8.20) జీపీఏ సాధించి పలమనేరు పట్టణ స్థాయిలో టాపర్లుగా నిలిచారన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు అభినందించారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోండి



గంగవరంలో అనుమతులు లేవని చెబుతున్న ఎస్వీ జూనియర్ కళాశాల ఇదే

పలమనేరు: పట్టణ సమీపంలోని గంగవరం మండల కేంద్రంలోని ఎస్వీ జూనియర్ కళాశాల నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నడుస్తోందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీయెట్ అధికారికి ఫిర్యాదు చేసినట్టు స్థానిక సీమాంధ్ర విద్యార్థి సంఘ నేత సురేష్ చౌదరి తెలిపారు. బంగారుపాళెంలోని ఎస్వీ కళాశాలను గంగవరంలోకి ఎలా బదిలీ చేశారో అర్థం కాలేదన్నారు. ఈ కళాశాలలో చేరిన విద్యార్థులకు సెంటర్ ఎక్కడుంటుందో కూడా ఇక్కడి నిర్వాహకులు చెప్పడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెలసిన ఇలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు.

రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనం గా నిర్వహించారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం రాహుకాల సమయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రాహుకాల పూజల్లో పాల్గొని దోష నివారణ పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

పీజీఆర్ఎస్‌కు స్పందన కరువు!

- సమస్యలకు త్వరితగతిన పరిష్కారం నిల్
- నివేదికలు సమర్పించకుండా తహసీల్దార్ల కాలయాపన
- కూటమి నేతల వద్దకు పంపుతున్న అధికారులు
- ఫలితంగా అర్జీలిచ్చినా దండగేనని గ్రీవెన్స్‌కు రాని బాధితులు



పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం బోసిపోయిన ప్రజా ఫిర్యాదుల వేదిక పరిష్కార వేదిక

పలమనేరు: గతంలో సోమవారం వస్తే చాలు.. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలు అర్జీదారులతో కిటకిటలాడేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఉన్న స్పందన కార్యక్రమాన్ని పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)గా పేరు మార్చి ప్రతి సోమవారం నిర్వహిస్తున్నారు. అయితే దీనికి పెద్దగా అర్జీదారులు రావడం లేదు. రెవెన్యూ సమస్యలేమో వేలల్లో ఉంటే ఫిర్యాదులు ఎందుకు రావడం లేదు? అనే అనుమానం ఎవరికైనా వస్తుంది. అయితే పలు పర్యాయాలు ఆర్డీఓ ఆఫీసులో అర్జీలిచ్చినా అధికారులు వాటిని త్వరిగతిన పరిష్కరించకపోవడమే కారణమనే వాదన వినిపిస్తోంది.

తహసీల్దార్ కార్యాలయాల్లో ఇంతే..!

జిల్లా కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో గ్రీవెన్స్‌డేలో అందిన అర్జీలను అక్కడి నుంచి ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు పంపుతారు. వీటిని ఆయా తహసీల్దార్లు గ్రీవెన్స్ బుక్‌లో నమోదు చేసి సంబంధిత ఆర్ఐలకు వీటికి గురించి తెలియజేస్తారు. వారు ఆయా రెవెన్యూ గ్రామాల వీఆర్వోలకు ఇచ్చి సమస్యలపై సంబంధించిన రికార్డులు పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఆర్ఐకి నివేదిక సమర్పించాలి. ఆయన దానిపై స్టేట్‌మెంట్ సిద్ధం చేసి తహసీల్దార్‌కు అందజేయాలి. ఆయన దానిపై పారావైజ్ రిమార్క్స్ రాసి ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుంది. లేదా పరిష్కరించాల్సి ఉంటుంది. కానీ గ్రీవెన్స్ పిటిషన్స్‌ను పట్టించుకునేవారే లేరు. దీంతో ప్రతి మండలంలో పెండింగ్ అర్జీలు పేరుకుపోతున్నాయి. ఆర్డీఓ కార్యాలయానికి అర్జీదారులు మళ్లీ మళ్లీ వెళ్లినా మండలం నుంచి ఇంకా రిపోర్ట్ రాలేదనే సమాధానం వస్తోంది.

పీజీఆర్ఎస్‌పై నమ్మకం కోల్పోతున్న ప్రజలు

ఇలా ఏ అర్జీలిచ్చినా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించకుండా నాయకులను కలవాలని చెప్పడం చూసిన అర్జీదారులు ఇక సమస్య అంతేనని నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. కూటమి నేతలవద్దకెళ్లకుండా కొందరు మాత్రం కోర్టులను ఆశ్రయిస్తున్నారు. మిగిలిన వారు ఏం చేయలేని పరిస్థితి. ఇక, తహసీల్దార్లు తాము మండల స్థాయి అధికారులనే మాట పక్కనబెట్టి, కూటమి నేతల చెప్పినట్లు వ్యవహరిస్తున్నారు. లేదంటే వారిపై ఫిర్యాదులు, ఆపై బదిలీలతో సాగనంపడం. దీంతో తహసీల్దార్లు సైతం నేతల చేతుల్లో కీలుబొమ్మలై తమకు న్యాయం చేయడం లేదని ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో పచ్చనేతల పెత్తనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో పచ్చనేతల పెత్తనం ఎక్కువైంది. ఎవరికి ఏ పని చేయాలన్నా కార్యాలయంలోని అధికారులే ఫలానా నాయకులను కలవండంటూ సిఫార్సు చేస్తున్నారు. దీంతో అర్జీదారులు వారిని కలిసి అధికారులకు చెప్పిస్తేనే పనులు చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ నేతల డిగినంత సమర్పిస్తే అందులో కొంతవారు అధికారుల చేతిలో పెడితేనే ఫైళ్లు కదిలే పరిస్థితి అన్ని మండలాల్లో దాపురించింది. కొన్ని మండలాల్లో అయితే తహసీల్దార్లే అర్జీ చూడగానే..'' ఓసారి అన్నను కలువు..వాళ్లు చెబితే చేస్తాం..లేదంటే కుదరదు'' అని చెప్పడం గమనార్హం! ఆయా కార్యాలయాల వద్ద కొందరు పచ్చనేతలు మకాం పెట్టి మరీ అధికారులు, సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో నుంచే ఓ కీలక ఉద్యోగి రెవెన్యూ సమస్యల కోసం వచ్చే వారితో డీల్ చేసేందుకు ఓ వ్యక్తిని సైతం నియమించుకున్నాడంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ వ్యక్తి నిత్యం ఆర్డీఓ కార్యాలయ సమీపంలో ఉంటూ ఆ ఉద్యోగితో డీల్ సెట్ చేసి పనులు చేయిస్తున్నాడు. సాక్షాత్తు ఆర్డీఓ కార్యాలయంలో ఇలా అక్రమాలు సాగుతుంటే ఇక తహసీల్దార్ కార్యాలయాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

నోటీస్ బోర్డు

29న పలమనేరులో సాహిత్య సభ

పలమనేరు : స్థానిక లయన్స్ సేవా కేంద్రంలో ఈనెల 29న సాహిత్యసభ నిర్వహించనున్నట్టు పలమనేరు రచయితల సంఘ నిర్వాహకులు పలమనేరు బాలాజి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన సీనియర్ సాహితీవేత్త వేణు గురించి మధురాంతకం నరేంద్ర స్మారక ఉపన్యాసం, పలమనేరు బాలాజి రచించిన ఏకలవ్య కాలనీ, లోపలేదో కదులున్నట్టుంది కవితా సంపుటి పరిచయ కార్యక్రమం, కవుల ఇష్టాగోష్ఠి తదితర కార్యక్రమాలుంటాయని తెలిపారు. జిల్లాలోని సాహితీ అభిమానులు దీనిని విజయవంతం చేయాలని కోరారు.

'స్లో మోటార్ సైకిల్ రైడింగ్'కు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నిర్వహించనున్న 'స్లో మోటారు సైకిల్ రైడింగ్' పోటీలకు ఆసక్తి ఉన్నవాళ్లు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ఓ ప్రకటనలో తెలిపారు. 100 మీటర్ల దూరాన్ని ద్విచక్రవాహనంపై కాలు కింద మోపకుండా.. ఎవరైతే తక్కువ వేగంతో లక్ష్యాన్ని చేరుకుంటారో వారిని విజేతలుగా ప్రకటించనున్నట్లు తెలిపారు. రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు బహుమతులుగా అందజేస్తామన్నారు. వివరాలకు ఫోన్-9491074517ను సంప్రదించి, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

మాకు న్యాయం చేయరూ!



చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద మండల ప్రజలు

- ఎక్స్‌ప్రెస్ హైవే మార్గాన్ని మార్చండి
- వ్యవసాయ భూములకు దారి కల్పించండి
- కలెక్టరేట్‌లో తోటకనుమ గ్రామస్తులు, రైతుల వినతి

వి.కోట: మా భూములకు వెళ్లే దారిని ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు మూసి వేశారని, తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చినట్టు మండలంలోని తోటకనుమ గ్రామస్తులు, రైతులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని తోటకనుమ రెవెన్యూ పరిధిలోని దాదాపు 200 మంది రైతులు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు సమస్య నివేదించారు. తమ గ్రామం నుంచి ఎక్స్‌ప్రెస్ హైవేకు అవతల వైపు పోవడానికి రోడ్డు ఉందని, ఈ రోడ్డు వెంబడి పలు గ్రామాల ప్రజల వ్యవసాయ భూములకు వెళ్లడానికి ఉన్న రహదారిని మూసివేసి, ఎక్కడో దూరంగా ఉన్న రోడ్డు మార్గానికి మార్చారని తెలిపారు. గతంలో ఉన్న రోడ్డు లేకుంటే తోటకనుమ పరిధిలోని చాలా మంది రైతులు, గ్రామస్తులు నష్టపోవాల్సి వస్తుందని, గతంలో ఉన్న రోడ్డు మార్గమే తమకు కావాలని విజ్ఞప్తి చేశారు.

'యువత పోరు'కు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



యువతపోరుకు పలమనేరు నుంచి వెళుతున్న వైఎస్సార్‌సీపీ యూత్, విద్యార్థి విభాగ నేతలు



పలమనేరు: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన యువతపోరు ఆందోళనకు పలమనేరు నుంచి వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం, యువజన విభాగానికి చెందిన నాయకులు 25 వాహనాల్లో తరలివెళ్లారు. స్థానిక కో-ఆర్డినేటర్ వెంకటేగౌడ పిలుపు మేరకు వీరు పెద్దసంఖ్యలో వెళ్లారు. రాష్ట్ర యూత్ నాయకులు కిశోర్, జిల్లా నేత సుబ్రమణ్యం నాయుడు, నియోజకవర్గ నేత చంద్రారెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు నరేష్, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు వెళ్లారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

చిత్తూరు కార్పొరేషన్: జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూజలు చేసి నివాళి అర్పించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ 1901లో బెంగాల్లో జన్మించిన ముఖర్జీ నెహ్రూ క్యాబినెట్లో పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేశారన్నారు. కానీ అప్పటి ప్రభుత్వం కశ్మీర్‌ను భారతదేశం నుంచి విడగొట్టి ప్రత్యేక దేశంగా ప్రకటించడంతో దానిని తీవ్రంగా ముఖర్జీ ఖండించారన్నారు. భారతీయ జనసంఘ్ పార్టీని ఏర్పాటు చేసి 370 ఆర్టికల్ రద్దు కోసం పోరాటం చేశారన్నారు. 71 ఏళ్ల తర్వాత నరేంద్ర మోదీ 370 ఆర్టికల్‌ను రద్దుచేసి శ్యాంప్రసాద్ ముఖర్జీకి అంకితం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామభద్ర, గోకుల్, సత్య, వేణు, జ్యోతి పాల్గొన్నారు.

పగలే వెన్నెల..!

- కరెంటు ఆదా చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం



గంగవరంలో పగలు కూడా వెలుగుతున్న వీధి లైటు

గంగవరం: మండల కేంద్రంలో వీధి లైట్లు రేయింబవళ్లూ వెలుగుతున్నాయి. స్విచ్చాఫ్ చేయకపోవడంతో కరెంటు దుబారా అవుతోంది. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. రేయింబవళ్లూ వెలుగుతుండడం వలన వీధిలైట్లు దెబ్బతింటున్నాయి. పలు గ్రామాల్లో తరచూ ఇలా వెలుగుతున్న వీధి లైట్లు పాడైపోయినా ఇంతవరకూ వాటిని మార్చలేదు. దాదాపు అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మండలం మొత్తం మీద గృహాలు, వీధి లైట్లు, పరిశ్రమలు, ఇతరత్రా మొత్తానికి కలిపి నెలకు విద్యుత్ వినియోగపరంగా దాదాపు 1.65 కోట్లకు ఖర్చు అవుతోందని లెక్కలు చెబుతున్నాయి. ఒక యూనిట్ ఆదా రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానం అని కరెంటు బిల్లుల వెనుక సందేశాలు ఉన్నా పంచాయతీ మాత్రం దీనిని పాటించడం లేదు. ఇకనైనా కరెంటు దుబారా కాకుండా వీధిలైట్లను పగలు ఆఫ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వరసిద్ధునికి వెండి వాహనం



వెండి మూషిక వాహనం అందజేస్తున్న హైదరాబాద్ వాసులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన పంకజ్ కుమార్ రూ.7లక్షల విలువ చేసే వెండి మూషిక వాహనాన్ని సమర్పించారు. దీని బరువు 7కిలోలు. ఏఈఓ రవీంద్రబాబు ఈ వాహనాన్ని స్వీకరించారు. దాతలకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

మా పిల్లలకూ 'తల్లికి వందనం' ప్లీజ్!

- అంగన్‌వాడీ వర్కర్ల వినతి



సీడీపీఓకు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కుప్పం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ వర్కర్ల పిల్లలకు కూడా వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్ల వెల్ఫేర్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎంపీడీఓ, కడా కార్యాలయం, సీడీపీఓలకు వినతి పత్రాలు అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు పేద కుటుంబాలకు చెందిన వారని, సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించాలని వారు కోరారు. ప్రభుత్వం ప్రతి నెలా 12 వేల రూపాయల ఆదాయం తక్కువున్న ప్రతి ఒక్కరికీ తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయని ప్రకటించిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11500, మినీ వర్కర్లకు రూ.7500 మాత్రమే గౌరవ వేతనం ప్రభుత్వం ఇస్తోందని, దీని ప్రకారం సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ వర్కర్ల పిల్లలు కూడా అర్హులే అవుతారని, తల్లికి వందనం పథకం తమకూ వర్తింపజేయాలని కోరారు.

బదిలీ టీచర్లకు వీడ్కోలు సన్మానం



పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పని చేసి వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవలను ప్రస్తుతించారు. బదిలీపై వెళ్లిన వారిలో హెచ్ఎం ఈశ్వర్‌ప్రసాద్, టీచర్లు ప్రభాకర్‌రెడ్డి, అహ్మద్‌బాషా, ఉమ, కృష్ణమోహన్, శ్యామల, స్వరూపరాణి, అజయ్‌కుమార్ ఉన్నారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి



తవణంపల్లె పీహెచ్‌సీలో స్కానింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ హనుమంతురావు

తవణంపల్లె: చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ (టీకాలు) అధికారి డాక్టర్ హనుమంతురావు వైద్యాధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో గర్భవతులను పరీక్షించే యంత్రాన్ని, ల్యాబ్‌ను, ఫార్మసీని, ఐఎల్ఆర్(ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్)ని తనిఖీ చేశారు. అనంతరం టీకాల కార్యక్రమంపై ఆరా తీసి సమీక్షించారు. పిల్లలకు క్రమం తప్పకుండా సకాలంలో టీకాలువ వేయించాలని సూచించారు. టీకాలు వేసిన వెంటనే లాన్‌లైన్‌లో నమోదు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ కేశవనారాయణ, ఆరోగ్యపర్యవేక్షకులు రాజశేఖర్, రెడ్డెమ్మ, నిర్మలమ్మ, ఎల్‌టి శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజ



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వర స్వామి ఆలయమైనా సోమవారం ప్రదోషకాల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్, నందీశ్వరుడికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకం చేశారు. విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈవో పెంచల కిషోర్ కర్పూర హారతులతో దర్శించుకున్నారు.

నెల్లిపట్ల రోడ్డు కష్టాలు తీరేదెన్నడో..?

- భారీ టన్నేజి జల్లి లోడ్లతో ఛిద్రమైన రోడ్డు
- ఎటుచూసినా గుంతలు, కంకర తేలిన వైనం
- ఇదే మార్గంలో భారీగా వెళ్తున్న కార్లు
- తరచూ తప్పని రోడ్డు ప్రమాదాలు



అధ్వానంగా మారిన కొలమాసనపల్లె-నెల్లిపట్ల రోడ్డు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె నుంచి నెల్లిపట్ల రోడ్డు మార్గం అధ్వానంగా మారింది. మూడేళ్లగా రోడ్డు దెబ్బతిని గుంతలమయమైంది. వర్షాలకు పలుచోట్ల రోడ్డు కోతకు గురై కంకర తేలింది. దీంతో ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. రోడ్డు బాగాలేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి సైతం ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు సమస్యలను నివేదించడం విదితమే. కొలమాసనపల్లె నుంచి నెల్లిపట్ల 11 కిలోమీటర్ల దూరం ఉంది. ఇందులో కొలమాసనపల్లె సమీపంలో 5 కిలోమీటర్ల నుంచి జల్లి, తారు టిప్పర్లు గంటకు వరకూ వచ్చి వెళుతున్నాయి. అధిక టన్నేజీతో వాహనాలు వెళ్తుండడంతో రోడ్డు బాగా దెబ్బతిందని గ్రామస్తులు చెప్పారు.

నిత్యం వందలాదిగా కార్లు

ఈ మార్గంలోని విరుపాక్షపురంలో పక్షవాతానికి నాటు మందు కోసం పలు రాష్ట్రాల నుంచి నిత్యం వందల సంఖ్యలో కార్లు వస్తుంటాయి. కేవలం 11 కిలోమీటర్ల దూరానికి గంటసేపు ప్రయాణించాల్సి వస్తోందంటే రోడ్డు ఎంత దుస్థితికి చేరిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా విపరీతమైన వాహనాల రద్దీ కారణంగా ఈ మార్గంలో ద్విచక్రవాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి కొలమాసనపల్లె నుంచి నెల్లిపట్లకు తారురోడ్డు వేయాలని ఆ మార్గంలోని ఏడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.